మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 312
పేజీలు : 3
మంగళవారం-16 జూన్, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య..

**టి మీడియా ,జూన్ 15, ముంబై:**



టీవీ నటి సంచితా ఉగాలే ఆత్మహత్య చేసుకున్నది. కుమ్‌కుమ్ భాగ్య సీరియల్‌లో ఆమె కీలక పాత్ర పోషించింది. ఆమె వయసు 22 ఏళ్లు. కుమ్‌కుమ్ భాగ్య టీవీ షోతో ఆమె పాపులర్ నటిగా మరింది. చావా చిత్రంలో కూడా ఆమె నటించింది. సంచితా ఆత్మహత్యతో ఆమె అభిమానులు షాక్‌లోకి వెళ్లారు. ఆత్మహత్య చేసుకోవడానికి కొన్ని గంటల ముందు ఆమె తన సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు షేర్ చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. ముంబైలోని నలసోపోరా ప్రాంతంలో తన పేరెంట్స్, సోదరితో కలిసి ఉంటోంది. ఆత్మహత్య ఘటన జరిగిన సమయంలో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏ కారణం చేత ఆమె ఆత్మహత్యకు పాల్పడిందో ఇంకా స్పష్టంగా తెలియదు. రూమ్‌లోని సీలింగ్ ఫ్యాన్‌కు నటి సంచితా ఉరి వేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. ఆమెను వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా.. మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. యాక్సిడెంటల్ డెత్ రిపోర్టును రిజిస్టర్ చేశారు.

# కిషన్‌రెడ్డి వల్లే

## మెట్రో నిధుల విషయంలో ఇబ్బందులు





## నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగింది

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**టీ మీడియా, జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**

మాజీ సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలు ప్రయాణించాల్సిన ప్రాంతాల్లో మెట్రో విస్తరణ జరగలేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌కు అంతర్జాతీయ సౌకర్యాలతో రవాణా సదుపాయం ఉండాలనే ఆలోచనతో గతంలో దేశంలోనే కీలకమైన హైదరాబాద్ మెట్రో రైలు నిర్మాణం గురించి చర్చ జరిగిందని గుర్తు చేశారు. రూ.15 వేల కోట్లతో పూర్తికావాల్సిన మెట్రో రైలు నిర్మాణం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మెట్రో రైలు నిర్మాణంలో హైదరాబాద్ కంటే ఇతర నగరాలు ముందుగా ఉన్నాయని పేర్కొన్నారు. సెకండ్ ఫేజ్‌లో మెట్రో విస్తరణ అనుమతి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చామని, ప్రతి ఏడాది రూ.400 కోట్ల నష్టం వస్తుందని ఎల్‌అండ్‌టీ చెప్పిందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మెట్రో విస్తరణకు ఎల్‌అండ్‌టీ ఒప్పుకోలేదని వివరించారు.

**ఎలాంటి గ్యారెంటీ లేకుండా అప్పుగా ఇచ్చారు**

రూ.30 వేల కోట్ల ఎల్‌అండ్‌టీ ఆస్తులను రూ.15 వేల కోట్లకు ప్రభుత్వం కొనుగోలు చేసిందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో నిర్మాణానికి కిలోమీటర్‌కు రూ.350 కోట్లు ఖర్చు అవుతుందని, ఎల్‌అండ్‌టీకి రూ.13,600 కోట్ల అప్పు ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అధికారులు భాగస్వాములుగా ఉన్నారని, తక్కువ వడ్డీకి రుణాలు తీసుకోవాలని ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పేర్కొన్నారు. గతంలో కేసీఆర్‌కు రూ.లక్షా 52 వేల కోట్లు అప్పుగా ఇచ్చారని, గతంలో కేసీఆర్‌కు ఆర్‌ఈసీ రూ.1.61 లక్షల కోట్లు అప్పులు ఇచ్చిందని, ఎలాంటి గ్యారెంటీ లేకుండా రూ.3.15 లక్షల కోట్లు అప్పుగా ఇచ్చారని తెలిపారు.

**కిషన్‌రెడ్డి వల్లే మెట్రోకు ఇబ్బందులు**

ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి ఎల్‌అండ్‌టీకి 4 శాతం వడ్డీకి రూ.13,600 కోట్ల రుణం ఇప్పించామని సీఎం తెలిపారు. బ్యాంకుల అప్పులకు రేవంత్ రెడ్డికి తేలికగా పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఇబ్బందులు వస్తాయని కిషన్‌రెడ్డియయ ఖట్టర్, అశ్వినీకి చెప్పారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి ఖట్టర్, అశ్వినీకి చెప్పాకే సెకండ్ ఫేజ్‌కు నిధుల విషయంలో ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు.

**కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారు**

గతంలో కిషన్‌రెడ్డిని కేసీఆర్ ఏమని తిట్టారో ప్రజలందరికీ తెలుసునని సీఎం తెలిపారు. ఐఆర్‌ఎఫ్‌సీ నుంచి రుణ నిధులు ఇంకా ఎందుకు మంజూరు కాలేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హామీ ఇచ్చినా కూడా లోన్ డబ్బు ట్రాన్స్‌ఫర్ కాలేదని, ఐఆర్‌ఎఫ్‌సీ లోన్ మంజూరు చేయకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని ఆరోపించారు. తెలంగాణ నుంచి కేంద్ర కేబినెట్‌లో ఉన్నది కిషన్‌రెడ్డికి బాధ్యత లేదా? అని నిలదీశారు. కిషన్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ కలిసి మెట్రో ఫేజ్-2ను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కేసీఆర్ సహకరించినందుకు కిషన్‌రెడ్డి గురుదక్షిణ చెల్లిస్తున్నారని విమర్శించారు.

**ఇంటి ముందు ధర్నా చేద్దామా?**

మెట్రో బదిలీని చాలా కష్టపడి ఒక కొలిక్కి తీసుకువచ్చామన్న రేవంత్ రెడ్డి.. ప్రజలు ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వాడుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు. మరి మెట్రో విస్తరణకు మాత్రం కేంద్రం ఎందుకు సహకరించట్లేదని నిలదీశారు. మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు కేంద్రం వద్దే ఆగి ఉందని విమర్శించారు. ఇటీవల అన్ని రాష్ట్రాలకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌కు ఆపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహ్మదాబాద్, విశాఖ మెట్రోకు అనుమతి ఇచ్చి హైదరాబాద్‌ను ఆపారని తెలిపారు. తెలంగాణపై కేంద్రం తీవ్రమైన వివక్ష కొనసాగిస్తోందని మండిపడ్డారు. మెట్రో అనుమతుల కోసం కిషన్‌రెడ్డి ఇంటి ముందు ధర్నా చేద్దామా? అని అడిగారు. కిషన్‌రెడ్డి వెనుక ఎవరున్నారో తాను నేరుగా చెప్పట్లేదని అన్నారు. కిషన్‌రెడ్డి కేబినెట్ మంత్రి కాబట్టి ఆయనకే ఎక్కువ బాధ్యత ఉందని హితువు పలికారు.

### రాజీనామా చేస్తే మేము కూడా చేస్తాం

బీజేపీ ఇచ్చిన హామీలు నెరవేర్చనందుకు ప్రధాని మోదీ రాజీనామా చేస్తారా? సీఎం నిలదీశారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని మోదీ అన్నారని గుర్తు చేశారు. హైదరాబాద్‌కు 2023లోనే ట్రిపుల్ ఆర్ ప్రకటించారని, ఇంకా సాకారం కాలేదని తెలిపారు. అన్నింటికి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేస్తే తాము కూడా చేస్తామని ప్రకటించారు.

# అమావాస్య ఎఫెక్ట్

## ఒంటరిగా పదో తరగతి విద్యార్థిని

**టి మీడియా ,జూన్ 15, రాజన్న సిరిసిల్ల:**



వేసవి సెలవులు ముగియడంతో స్కూళు పునఃప్రారంభమయ్యాయి. అయితే అమావాస్య రోజు పాఠశాలలు రీఓపెన్ కావడంతో మొదటి రోజు హాజరు శాతం భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్కూళ్లలో చాలా తక్కువ మంది విద్యార్థులపై హాజరయ్యారు. కొన్ని చోట్ల పదుల సంఖ్యలోనే విద్యార్థులు హాజరవ్వగా.. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం గీతానగర్‌లోని బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని ఒక్కతే పాఠశాలకు వచ్చింది. తోటి క్లాస్‌మేట్స్ ఎవరూ లేకపోవడంతో ఆ విద్యార్థిని ఒంటరిగానే క్లాస్ రూంలో కూర్చుంది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ పునఃప్రారంభ తేదీ అమావాస్య రోజు రావడంతో కొందరు అశుభంగా భావిస్తున్నారు. ఈ రోజున కొత్త పనులు, చదువులు ప్రారంభించడం మంచిది కాదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. తెల్లవారి పంపుదామంటే మంగళవారం అవుతుండడంతో ఈ రెండు రోజులు పిల్లలను ఇంటి వద్దే ఉంచాలని వారు ఆలోచిస్తున్నారు. దీంతో ఈ రోజుల్లో విద్యార్థుల హాజరు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రైవేట్ స్కూళ్లు ముందుగానే అమావాస్యను ఆలోచించి ఈ నెల 17న (బుధవారం), 19న (శుక్రవారం) ప్రారంభించేందుకు నిర్ణయించాయి.

# అంచనా వ్యయం ఎందుకు పెరిగింది

- మెట్రో రెండో దశపై కేంద్రం సందేహాలు

**టి మీడియా ,జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**

హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశపై కేంద్ర ప్రభుత్వం అడిగిన సందేహాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర వివరణలు పంపింది. కారిడార్ల వారీగా సమాధానాలు ఇస్తూ మున్సిపల్, అర్బన్ డెవలప్?మెంట్ శాఖ తాజాగా లేఖ పంపింది. సత్వరం మెట్రో విస్తరణకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రాన్ని మరోసారి కోరింది. ఎల్‌అండ్‌టీ కంపెనీ నుంచి మెట్రోరైలు మొదటి దశ స్వాధీనం తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ ఎ, బి కారిడార్లలో మార్పులు చేసి కేంద్రానికి పంపించింది.కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ కోరినట్లు ఫ్యూచర్ సిటీ మెట్రోరైలు కారిడార్‌ను రెండో దశ నుంచి రాష్ట్ర ప్రభుత్వం తేసేసింది. దానిని మూడో దశకు మార్చింది. ప్రస్తుతానికి రెండో దశలో ఏడు కారిడార్ల పాజెక్టు సమగ్ర వివరాలను మాత్రమే కేంద్రానికి పంపింది. వీటిని పరిశీలించిన కమిటీ మెట్రో బెంచ్‌మార్క్ ధరల కంటే ప్రతిపాదిత నిర్మాణ వ్యయం ఎక్కువగా ఉండటంపై పలు సందేహాలను వ్యక్తం చేసింది. ఎక్కువగా పాతబస్తీలో నిర్మించబోయే మెట్రోరైలు కారిడార్‌పై ప్రశ్నలు అడిగింది. ఇక్కడ ఎందుకు ఎక్కువ ఖర్చు అవుతుందని సందేహం వ్యక్తం చేసింది. ఆ వ్యయాన్ని సమర్థిస్తూ సంబంధిత కారణాలను రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా వివరించింది.

**నెట్‌వర్క్ అంతటా ఆదాయం**

మెట్రోరైలు పాలసీ, మార్గదర్శకాల ప్రకారం మెట్రో ప్రాజెక్టుల ఎకనామిక్ ఇంటర్నల్ రేట్ ఆఫ్ రిటర్న్(ఈఐఆర్ఆర్) కనీసం 14 శాతందా ఉండాలని నిబంధన ఉంది. ట్రాఫిక్ రద్దీ తగ్గడం, వాహనాను నుంచి కర్బన ఉద్గారాల తగ్గింపు, ప్రయాణ సమయం ఆదా, రహదారి ప్రమాదాల నివారణ వంటి సానుకూల ప్రయోజనాల ఆధారంగా ఈఐఆర్ఆర్‌ను లెక్కగడతారు. హైదరాబాద్ మెట్రో రెండో దశలోని ఏడు కారిడార్లు ఈ పరిమితిని మించే 14 నుంచి దాదాపు 20 శాతం వరకు ఈఐఆర్ఆర్‌ను కలిగి ఉన్నాయి. రెండో దశలోని ఏడు కారిడార్లలో నాలుగు నేరుగా మొదటి దశ కారిడార్లకు పొడిగింపుగా(కొనసాగింపుగా) ఉన్నాయి. ఈ కనెక్టివిటీతో ప్రయాణికుల సంఖ్య పెరగడమే కాకుండా మొత్తం నెట్‌వర్క్ అంతటా అధిక ఆదాయం లభిస్తుందని అంచనా వేశామని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రం వివరించింది.



**సిగ్నలింగ్‌లో అదనపు ఖర్చులు**

మెట్రో మొదటి దశలో ఉపయోగిస్తున్న థేల్స్(ప్రస్తుతం హిటాచీ) సీబీటీసీ సిస్టంనే రెండో దశలోని పొడిగింపు కారిడార్లలో ఉపయోగించాల్సి ఉంటుంది. వారిచ్చే సాఫ్ట్‌వేర్‌పై ఆధారపడాల్సి రావడంతో సిగ్నలింగ్‌లో 50 శాతం, టెలికాంలో 25 శాతం అదనపు వ్యయాలను పరిగణనలోకి తీసుకున్నామని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి వివరించింది.

**టెక్నాలజీ వ్యయాల సమర్థన**

ప్రధాన జంక్షన్లు, యుటిలిటీ కారిడార్ల వద్ద మెట్రో నిర్మాణానికి ప్రత్యేక స్పాన్‌లు అవసరం. ఈ కారణంగా వయాడక్ట్ ఖర్చులో 5 శాతం అదనంగా కేటాయించామని రిపోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.రోడ్ ఓవర్ బ్రిడ్జి(ఆర్వోబీ)ల కారణంగానూ వ్యయం పెరిగింది. ఆరాంఘర్, శంషాబాద్, సుచిత్ర జంక్షన్, లోతుకుంట, అల్వాల్‌లలో ఒక్కో ఆర్వోబీ నిర్మాణానికి మెట్రో మొదటి దశ అనుభవంతో ఒక్కోదానికి రూ.25 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేశారు.

అత్యవసర పరిస్థితుల్లో మెట్రో రైళ్లను నిలిపేందుకు, రద్దీ వేళల్లో రైళ్ల నిర్వహణ సౌలభ్యం కోసం జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట, నాగోల్ - శంషాబాద్ ఎయిర్?పోర్టు కారిడార్లలో అదనపు పాకెట్ ట్రాక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. చాంద్రాయణగుట్ట వద్ద మెట్రో మళ్లేందుకు 620 మీటర్ల రివర్సల్ ట్రాక్‌ను సైతం ప్రతిపాదించారు. వీటితో ఖర్చు మరింత పెరుగుతోంది.



## తెలంగాణలో మోగిన బడి గంట

### బ్రేక్ ఫాస్ట్‌తో తెరుచుకున్న పాఠశాలలు

**టి మీడియా ,జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**

నేడు తెలంగాణ వ్యాప్తంగా బడిగంట మోగింది. వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి పునః ప్రారంభమయ్యాయి. 52 రోజుల వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు తెరుచుకున్నాయి. తెలంగాణలోని 8 జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రభుత్వం 'సీఎం బ్రేక్ ఫాస్ట్ విత్ మిల్క్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది.రాష్ట్రవ్యాప్తంగా 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. హైదరాబాద్?లోని రాజ్?భవన్ పాఠశాలలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని ప్రారంభించారు. నేలపై కూర్చుని విద్యార్థులతో కలిసి ఆయన అల్పాహారాన్ని స్వీకరించారు. విద్యార్థినికి తన చేతులతో టిఫిన్ తినిపించారు. ఈ దృశ్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, యశస్విని రెడ్డి, కలెక్టర్ ప్రియాంక ఆల, మాజీ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**3 రోజులు పాలు - 3 రోజులు రాగి జావ**

మిగతా పాఠశాలల్లో విద్యార్థులకు టీచర్లు, సిబ్బంది బ్రేక్‌ఫాస్ట్?ను అందించారు. ఇంటర్, పాఠశాల విద్యార్థులు కలిపి 1.44 లక్షల మందికి పైగా ప్రయోజనం చేకూరనుంది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. అల్పాహారంతో పాటు వారంలో మూడు రోజులు

మిగతా 3లో..

# లెబనాన్ నుంచి వెనక్కి తగ్గం


- ఆక్రమించిన ప్రాంతాలను కూడా వదలం
- ఇజ్రాయెల్ రక్షణ మంత్రి వెల్లడి

**టి మీడియా ,జూన్ 15, ఢిల్లీ బ్యూరో :**

అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందానికి లైన్ క్లియర్ అయిన నేపథ్యంలో సోమవారం ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఒక అనూహ్యమైన ప్రకటన చేశారు. యూఎస్?-ఇరాన్ తాత్కాలిక ఒప్పందం తేలేవరకు లెబనాన్? నుంచి వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అంతేకాదు ఇప్పటి వరకు ఆక్రమించిన భూభాగాలను కూడా విడిచిపెట్టమని స్పష్టం చేశారు.

**వెనక్కి తగ్గేదేలేదు!**

"నేను మా ప్రధాని మంత్రి ఎప్పుడూ ఒక విషయాన్ని చెబుతుంటాను. అది ఏమిటంటే, ఈ చారిత్రక సమయంలో, ఒక గట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. నా స్టాండ్ చాలా స్పష్టంగా ఉంది. మన భద్రతకు హామీ ఇవ్వని ఈ ఒప్పందంలో మేము భాగస్వాములం కాము. అంతేకాదు అమెరికా-ఇరాన్? మధ్య కుదిరిన ఈ ఒప్పందం మమ్మల్ని ఏ విధంగానూ కట్టిపడేయలేదు. హిజ్బోల్లాను నిర్మూలించడమే మా లక్ష్యం. ఆ విషయంలో మేమీ రాజీపడం. అంతేకాదు మన సైనికులు స్వాధీనం చేసుకొని, ఉగ్రవాద స్థావరాలను తుడిచిపెట్టిన ఏ భూభాగం నుంచి మనం వెనక్కు తగ్గకూడదు. ఉత్తర సరిహద్దు ప్రాంతాల కంచెల వద్ద వేలాది మంది ఉగ్రవాదులు కూర్చునే పాత పరిస్థితికి మనం మళ్లీ వెళ్లకూడదు. ఇజ్రాయెల్?పై చేసే దాడులను చూస్తూ మనం ఎంత మాత్రం మౌనంగా ఉండకూడదు. మనం ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. లెబనాన్ నుంచి ఇజ్రాయెల్ వైపు వచ్చే ప్రతి డ్రోన్?, యూఏవీ లేదా క్షిపణి దాడికి ప్రతిచర్యగా, దహియాపై కచ్చితంగా ఇజ్రాయెల్ దాడి చేయాలి. ఈ వ్యూహాత్మక పట్టును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోకూడదు. వీటన్నింటి కంటే మనం అందరికి ఒక విషయాన్ని స్పష్టం చేయాలి. అదేమిటంటే, ఇజ్రాయెల్ ప్రజలు 3వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర ఉన్నవారు. వీరు దేనికీ భయపడని శ్రమజీవులు. సృష్టికర్తపై మాకు నమ్మకం ఉంది. మేము బలమైన గర్వించదగిన దేశంగా, మా మాతృభూమికి తిరిగి వచ్చాం. ఇకపై శత్రువుల ముందు తలదించుకునే ప్రసక్తే లేదు. యూదులు దెబ్బలు తింటూ మౌనంగా ఉండే రోజులు ఎప్పుడో ముగిసిపోయాయి. ఇకపై అలా ఎప్పటికీ జరగదు" అని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.




**నెతన్యాహుపై ట్రంప్ ఆగ్రహం**

కాగా, అమెరికా- ఇరాన్ ఒప్పందం కుదిరిన తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై డొనాల్డ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్-యూఎస్ శాంతి ఒప్పందాన్ని నెతన్యాహు దాదాపు చెడగొట్టే ప్రయత్నం చేశారని ఆరోపించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడి వల్లే వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య ఒప్పందం కుదరడంలో జాప్యం జరిగిందని అన్నారు. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కుదిరినందుకు ఇజ్రాయెల్ తమకు ఎంతో కృతజ్ఞతతో ఉండాలని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒకవేళ ఇరాన్ చేతికి గనుక అణ్వాయుధం చిక్కి ఉంటే, రెండు గంటల్లో ఇజ్రాయెల్ భూమి మీద లేకుండా పోయేదని ట్రంప్ అన్నారు.

## వైజాగ్ ఎయిర్‌పోర్ట్ తరలింపు

### 80 ఏళ్ల జ్ఞాపకాలకు వీడ్కోలు!

**టి మీడియా ,జూన్ 15, విశాఖపట్నం :**




ప్రతి ప్రదేశానికీ ఒక చరిత్ర ఉంటుంది. అంతేకాకుండా, దానితో ముడిపడి ఉన్న ప్రత్యేక అనుభూతులు, అనుభవాలు తరచుగా మనకు ఉంటాయి. ఒక ప్రదేశం ఇకపై అక్కడ ఉండదని హఠాత్తుగా తెలిస్తే. ఊహించుకుంటుంటేనే మనసంతా ఏదోలా ఉంది కదూ. విశాఖపట్నం వాసులు ప్రస్తుతం సరిగ్గా ఇదే బాధను అనుభవిస్తున్నారు. విశాఖపట్నం విమానాశ్రయానికి 80 ఏళ్ల చరిత్ర ఉంది. ఇది త్వరలో భోగాపురానికి తరలిస్తున్నారనే విషయాన్ని జీర్ణించుకోవడం నగరవాసులకు కష్టంగా ఉంది. వారికీ ఈ విమానాశ్రయానికీ మధ్య అంతటి బలమైన భావోద్వేగ అనుబంధం ఉంది. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో ఒక చిన్న సైనిక విమాన స్థావరంగాప్రారంభమైన ఇది, కాలక్రమేణా ఆంధ్రప్రదేశ్‌లోనే రెండవ అతిపెద్ద అత్యంత కీలకమైన అంతర్జాతీయ విమానాశ్రయంగా రూపాంతరం చెందింది.

**క్రమంగా సాగిన అభివృద్ధి**

విశాఖపట్నం విమానాశ్రయానికి పునాది 1941లో, రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో పడింది. రాయల్ ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అవసరాల కోసం బ్రిటిష్ పాలకులు ఈ విమాన స్థావరాన్ని నిర్మించారు. రన్‌వే నిర్మాణ బాధ్యతను 'వింటేజ్ ఆర్కిటెక్ట్'గా పేరున్న ముప్పిడి కుటుంబానికి అప్పగించారు, దీనిని 45 రోజుల్లో పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. వారు కొండ ప్రాంతాన్ని వేగంగా చదును చేసి, నిర్ణీత గడువు కంటే ముందే రన్‌వే నిర్మాణాన్ని పూర్తి చేశారు. 1954లో పౌర విమాన కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. అయితే ఆ సమయంలో విమాన రాకపోకలకు పరిమిత అనుమతులు మాత్రమే ఉండేవి. 1981లో పూర్తి స్థాయి

మిగతా 3లో..

# బస్సులు, ఆటోల ఫిట్‌నెస్‌పైనే ఆందోళన!

- **వేలాది మంది విద్యార్థుల రాకపోకలు**

**టి మీడియా ,జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**

వేసవి సెలవుల అనంతరం తెలంగాణలోని పాఠశాలలు సోమవారం పునఃప్రారంభం అయ్యాయి. విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఆయా స్కూళ్ల యాజమాన్యాలు రకరకాల ఏర్పాట్లు చేశాయి. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టూల్స్ ఉపయోగించి పాఠాలు బోధించేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ విత్ మిల్క్ అనే కార్యక్రమాన్ని కూడా ప్రారంభించింది. ఇందులో భాగంగా ప్రతి విద్యార్థికి వారానికి మూడు రోజులపాటు గుడ్లు, మరో మూడు రోజులు రాగిజావ, మధ్యాహ్న భోజనంతో పాటు విద్యాకిట్లు అందించనున్నారు. కొన్నిచోట్ల ఇప్పటికీ తరగతి గదులు, వాష్?రూమ్స్, మూత్రశాలల కొరత వేధిస్తుండటం గమనార్హం.



**ఆటోల్లో పరిమితికి మించితే ప్రమాదమే**

రాష్ట్రంలో పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు వేలాది మంది స్కూల్? బస్సులు, ఆటోల్లో రాకపోకలు సాగించడం సాధారణమే. కానీ కొందరు ఆటో డ్రైవర్లు పరిమితికి మించి బాలబాలికలను పాఠశాలలకు తీసుకువెళ్తుంటారు. ఇరుకిరుకు ప్రయాణం విద్యార్థులను త్వరగా అలసిపోయేలా చేస్తోంది. ఈ నేపథ్యంలో బడి పిల్లల రవాణా విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

**వీటిని పాటిస్తే మంచిది**

పిల్లలను తరలించే ఆటోలకు తప్పనిసరిగా పాఠశాల ఆటో అనే బోర్డు ఉండాలి.

పరిమితికి మించి పిల్లలను ఆటోల్లో ఎక్కించకూడదు. తక్కువ డబ్బులు తీసుకుంటున్నాడని ఎక్కువ మందిని తరలిస్తామంటే అటువంటి చర్యలను ప్రోత్సహించకూడదు. బస్సు, ఆటో డ్రైవర్‌కు లైసెన్సు, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు ఉన్నాయా? లేవా? అనేది ఒకటికి రెండుసార్లు చూసుకోవాలి. డ్రైవర్ చిరునామా, కుటుంబ నేపథ్యం, గతంలో ఎక్కడైనా ప్రమాదాలు చేసిన ఉదంతాలు ఉన్నాయేమో క్షుణ్ణంగా విచారణ చేయాలి. మద్యం, ధూమపానం వంటి అలవాట్లు ఉండేవారిని వీలైనంత మేర దూరంగా పెట్టాలి. ఆటో కండిషన్ బాగున్నా పిల్లలను క్రమపద్ధతిలో కూర్చోబెడుతున్నారో లేదో నిశితంగా పరిశీలించాలి. ఆటోలో పిల్లలు ఊగులాడకుండా, గెంతులాడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తప్పనిసరిగా డ్రైవర్‌దే. ఇందుకోసం పక్కన గ్రిల్స్?ను ఏర్పాటు చేయించాలి. పిల్లలను డ్రైవర్ పక్క సీటులో ఎట్టిపరిస్థితుల్లోనూ కూర్చోబెట్టుకోకూడదు. ఏ కారణం చేతనైనా ఆటో డ్రైవర్ స్థానంలో కొత్త చోదకుడు వస్తే అతడి వ్యక్తిగత వివరాలు, అలవాట్లు ముందే తప్పనిసరిగా తెలుసుకోవాలి.

ఆటోడ్రైవర్ అడ్రస్?, ఐడీ కార్డు స్కూళ్లో తప్పనిసరిగా ఉండేలా ప్రధానోపాధ్యాయుడు ఆదేశాలు ఇవ్వాలి. పాఠశాల యాజమాన్యాలు నెలకొకసారి ఆటో, బస్సు డ్రైవర్లతో మీటింగ్?లు నిర్వహించి ట్రాఫిక్ రూల్స్ తెలియజేయాలి.

కొందరు డ్రైవర్లు ఆడపిల్లల పట్ల అనుచితంగా ప్రవర్తించిన ఘటనలు చూస్తుంటాం. అలాంటప్పుడు డ్రైవర్ల గురించి తల్లిదండ్రులు మాటల సందర్భంలో పిల్లలను అడిగి స్వేచ్ఛగా తెలుసుకోవాలి. ఆటోలకు రెండువైపులా ఇష్టానుసారంగా పిల్లల పుస్తకాల బ్యాగులు తగిలించకూడదు. ఒక్కోసారి ఇరుకు వీధుల్లో ఆటో వెళ్లని క్రమంలో డ్రైవరే జాగ్రత్తగా పిల్లలను చేయిపట్టుకుని రోడ్డు దాటించాల్సిన బాధ్యత ఉంటుంది.

తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను బస్సు ఎక్కించే సమయంలో ట్రాఫిక్?ను గమనిస్తూ, పరిమితికి మించి విద్యార్థులు ప్రయాణం చేస్తుంటే వెంటనే యాజమాన్యాన్ని నిలదీయాలి. స్థానిక పోలీసు, రవాణా శాఖ యంత్రాంగం నిరంతర తనిఖీలు చేపడుతూ, నిబంధనలు ఉల్లంఘించే విద్యాసంస్థలపై భారీ జరిమానాలతో వాహనాలను సీజ్? చేయాలి. క్రిమినల్ కేసులు నమోదు చేసినప్పుడే చిన్నారుల ప్రయాణం పట్ల యాజమాన్యాలు మరింత బాధ్యతగా మెలుగుతాయి.

**కేసులు నమోదు చేస్తున్న రవాణాశాఖ**

నేటి నుంచి స్కూళ్లు పునఃప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో అధికారులు విద్యా సంస్థల వాహనాలు తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ వెంటనే కేసులు నమోదు చేస్తుంది. ఇవాళ వెయ్యికి పైగా స్కూల్ బస్సులను తనిఖీలు చేసిన ఆర్టీఏ అధికారులు నిబంధనలు ఉల్లంఘించిన 150కి పైగా బస్సులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఫిట్‌నెస్ లేని 35 స్కూళ్ల వాహనాలను సీజ్ చేశారు.




## లయన్స్ క్లబ్ కు నూతన మహిళా సారథులు

**టి మీడియా ,జూన్ 15, రామగుండం:**

లయన్స్ క్లబ్ రెండో పీఎస్టీలుగా మహిళా సారథులకు పట్టం కట్టారు. ఈమేరకు గోదావరిఖని ఆర్‌ఆర్ గార్డెన్ లో క్లబ్ 55వ సంస్థాపన వేడుక అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిగా బంక కళావతి, కార్యదర్శిగా కజంపురం జయప్రద, కోశాధికారిగా పద్లకొండ ఉమారాణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంస్థాపన అధికారిగా మాజీ డిస్ట్రిక్ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి నూతన పీఎస్టి లచే ప్రమాణ స్వకారం చేయించారు. మాజీ డిస్టిక్ గవర్నర్ మినేష్ నారాయణన్ టండన్, ముద్దసాని ప్రమోద్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో 55 యేళ్ల ప్రస్థానంతో క్లబ్ కు ప్రపంచ గుర్తింపు లభించడం సభ్యుల అంకితభావం, క్రమశిక్షణే కారణమన్నారు. లయనిజంలో అనుభవజ్ఞులైన మహిళలకు రెండవసారి సమాజ సేవ చేసేందుకు అవకాశం దక్కిందనీ, గత మహిళా పీఎస్ టీ లను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లయన్ రామస్వామి, తానిపర్తి గోపాల్ రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ లయన్ సభ్యులు ఎస్. సత్యనారాయణ, గంగాధర్, శరత్ బాబు, రాజేందర్, పీ. మల్లికార్జున్, రమాపతి రావు, రవీంద్రచారి, ఎల్లప్ప, సారయ్య, రాజేంద్రకుమార్, మనోజ్ కుమార్, జోన్ చైర్ పర్సన్ తానిపర్తి విజయలక్ష్మీ, ఎస్ లావణ్య, తిలక్ చక్రవర్తి, మనీషా అగర్వాల్, వివిధ ఏరియాల క్లబ్ బాధ్యులు పాల్గొన్నారు.

# పసికందు విక్రయ ఆరోపణలు కలకలం

- **తల్లి అంగీకారంతో కేసులో కొత్త ట్విస్ట్**



**టి మీడియా ,జూన్ 15,మెదక్ :**

ఉమ్మడి మెదక్ జిల్లాలో శిశు విక్రయాలు కలకలం రేపుతున్నాయి. మొన్నటికి మొన్న మెదక్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో జరిగిన ఘటన మరవక ముందే తాజాగా మరో ఘటన కలకలం రేపుతుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి (మం) ఉప్పు లింగాపూర్ గ్రామంలో రెండు నెలల మగ శిశువును విక్రయించినట్లు వస్తున్న ఆరోపణలు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి. గ్రామానికి చెందిన ఎరుకలి మమత అనే మహిళకు రెండు నెలల క్రితం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో మగ శిశువు జన్మించాడు. అయితే, ఆ పసికందును కుటుంబ సభ్యుల సహకారంతో విక్రయించారనే వార్త బయటకు రావడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. మమత భర్త గతంలోనే మరణించాడు.. గర్భవతిగా ఉన్న సమయంలో ఆమె పుట్టింటికి చేరింది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల నడుమ ఆమె మగ శిశువుకు జన్మనిచ్చింది. అయితే, పుట్టిన రెండు నెలలకే ఆ శిశువు ఇంట్లో లేకపోవడంతో స్థానికంగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. బిడ్డను విక్రయించారనే ఆరోపణలు రావడంతో మహిళా శిశు సంక్షేమ శాఖ, పోలీస్ అధికారులు అలర్ట్ అయ్యారు. విషయం తెలుసుకున్న స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్ అధికారులు ఉప్పు లింగాపూర్ గ్రామానికి చేరుకొని, బాధిత మహిళతో పాటు కుటుంబ సభ్యులను సుదీర్ఘంగా విచారించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో మమత అసలు విషయాన్ని అంగీకరించింది. తనకు అంత స్తోమత లేకపోవడం వల్లే బిడ్డను దత్తత ఇచ్చానని ఆమె అధికారుల ముందు పేర్కొన్నట్లు తెలుస్తోంది. కానీ, ఇది కేవలం దత్తత మాత్రమేనా? లేక దీని వెనుక పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయా? అనే కోణంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చట్టబద్ధంగా కాకుండా, కొందరు వ్యక్తుల మధ్యవర్తిత్వంతో డబ్బుల కోసమే శిశువును విక్రయించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అక్రమ దత్తత వెనుక ఎవరెవరు ఉన్నారనే దానిపై అధికారులు ఆరా తీస్తున్నారు.

# సీఎం విజయ్, సంగీత విడాకుల కేసు విచారణ వచ్చే నెలకు వాయిదా

**టి మీడియా ,జూన్ 15, ఢిల్లీ బ్యూరో :**

తమిళనాడు సీఎం , ప్రముఖ నటుడు విజయ ఆయన భార్య సంగీత స్వర్ణలింగం విడాకులు కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇవాళ చెంగల్పట్టు మహిళా కోర్టులో విచారణ జరిగింది. ఉదయం 10:30 గంటలకు ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 7వ తేదీకి వాయిదా వేసింది. విజయ్‌కి మరో నటితో వివాహేతర సంబంధం ఉందని ఆరోపిస్తూ సంగీత ఈ ఏడాది ఫిబ్రవరిలో ఈ విడాకుల పిటిషన్ దాఖలు చేశారు. తన పిటిషన్‌లో సంగీత పలు సంచలన ఆరోపణలు చేశారు. 2021 లోనే విజయ్‌కు మరో నటితో వివాహేతర సంబంధం ఉందని తాను గుర్తించానని, దీనిపై నిలదీసినప్పుడు ఆ బంధాన్ని తెంచుకుంటానని విజయ్ పలుమార్లు హామీ ఇచ్చారని ఆమె తెలిపారు. అయినప్పటికీ, విజయ్ ఆ సంబంధాన్ని కొనసాగించడమే కాకుండా సదరు నటితో కలిసి విహారయాత్రలకు, ఇతర కార్యక్రమాలకు హాజరయ్యారని ఆరోపించారు. వారిద్దరూ బహిరంగ ప్రదేశాల్లో కలిసి ఉన్న ఫొటోలను ఆ నటి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం ద్వారా తనను, తన ఇద్దరు పిల్లలు జాసన్ సంజయ్, దివ్య సాషాను తీవ్ర అవమానానికి గురిచేశారని సంగీత ఆవేదన వ్యక్తం చేశారు. విజయ్ తనపై ఆర్థిక ఆంక్షలు విధించారని, గతంలో ఉన్న సౌకర్యాలను ఉపసంహరించుకుని, తన స్వేచ్ఛను కూడా నియంత్రించారని సంగీత ఆరోపించారు. ఈ పరిణామాలవల్ల తాను తీవ్రమైన మానసిక వేదనకు గురయ్యానని, ప్రత్యేక వివాహాల చట్టంలోని సెక్షన్ 27 (1), 27(1)కింద తనకు విడాకులు మంజూరు చేయాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. 2000 సంవత్సరంలో వివాహం చేసుకున్న విజయ్, సంగీత.. తమ 26 ఏళ్ల వైవాహిక బంధానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. వాస్తవానికి ఈ కేసు విచారణ ఏప్రిల్ 20 నే జరగాల్సి ఉండగా.. వారిద్దరూ హాజరుకాకపోవడంతో జూన్ 15న తప్పనిసరిగా హాజరు కావాలని కోర్టు ఆదేశాలు జారీచేసింది. ఒకవైపు వ్యక్తిగత జీవితంలో ఈ గందరగోళం నడుస్తుండగా.. మరోవైపు విజయ్ రాజకీయ ప్రస్థానం ఉన్నత శిఖరాలకు చేరింది. ఆయన స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించింది. దాదాపు 60 ఏళ్లుగా తమిళనాడును పాలిస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలను ఓడించి మే 10న విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.



# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు

- **అందజేసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**



**టి మీడియా ,జూన్ 15,రామగుండం:**

ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. 4వ డివిజన్‌కు చెందిన సమినాబేగంకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ. 22 వేల చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 4వ డివిజన్ కార్పొరేటర్ కంకణాల మౌనిక రాజు గార్ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ గారి చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

# సింగరేణి గనిలో ప్రమాదం..

- **బ్లాస్ట్‌లో తెగిపోయిన కార్మికుడి చేతి వేళ్లు**



**టి మీడియా ,జూన్ 15,జయశంకర్ భూపాలపల్లి:**

జిల్లాలోని సింగరేణి కేటీకే-5 ఇంక్లైన్‌లో ప్రమాదం జరిగింది. గనిలో బ్లాస్టింగ్‌కు వినియోగించే పూర్ణిని స్కాన్ చేస్తున్న సమయంలో శ్రీరాములు ప్రవీణ్ అనే కార్మికుడి చేతిలో పేలిపోయింది. ఈ ఘటనలో కార్మికుడి చేతి వేళ్లు తీవ్రంగా దెబ్బతిని ఊడిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే కార్మికుడిని తోటి కార్మికులు సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. కాగా, ఈ ప్రమాదంపై సింగరేణి కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గనుల్లో నాసిరకం సామగ్రిని ఉపయోగిస్తూ కార్మికుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. ఘటనకు గని మేనేజర్ రమేశ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

## శ్రీ సత్యసాయి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- **ఆగి ఉన్న లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం, ముగ్గురు మృతి**

**టి మీడియా ,జూన్ 15, శ్రీ సత్యసాయి :**




శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం తడకలపల్లి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదానికి గురై మృతి చెందారు.

**లారీని ఢీకొన్న ద్విచక్ర వాహనం**

పోలీసుల వివరాల ప్రకారం, ఆది, మహేంద్ర, త్రిలోక్ అనే ముగ్గురు యువకులు మడకశిర నుంచి హిందూపురం వైపు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. మార్గమధ్యంలో తడకలపల్లి గ్రామ సమీపానికి చేరుకున్న సమయంలో రహదారి పక్కన నిలిపి ఉంచిన లారీ వెనుక భాగాన్ని వారి ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారి వాహనం నుజ్జునుజ్జయింది.

**ఇద్దరు అక్కడికక్కడే మృతి**


ఈ ప్రమాదంలో ఆది, మహేంద్రలకు తీవ్ర గాయాలు కావడంతో వారు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో యువకుడు త్రిలోక్ తీవ్రంగా గాయపడగా స్థానికులు, పోలీసులు వెంటనే అతడిని హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. త్రిలోక్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మార్గమధ్యంలో సోమవారం తెల్లవారుజామున అతడు కూడా మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

**కేసు నమోదు**

ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుల మృతితో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

# సమస్యను పరిష్కరించిన విద్యుత్ అధికారులు

**టీ మీడియా, జూన్ 15, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం గాలి వానలకు కరెంటు వైర్లపైన చెట్లు పడడంతో కరెంటు నిలిచిపోయింది. 24 వార్డు ప్రజలు బిఆర్ఎస్ యువజన నాయకులు వజ్రాల రమేష్ తెలపడంతో రమేష్ కరెంటు ఏఈ కి తెలిపారు. స్పందించిన ఏఈ లైన్మెన్ సూర్యంగౌడ్,వేణు రాముడు పంపి కరెంటు సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు

- **మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర**

**టి మీడియా ,జూన్ 15, నల్లగొండ :**



వర్షాకాలంలో నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అధికారులను ఆదేశించారు. మేయర్ ఆదేశాల మేరకు మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర నగరంలోని 5, 38, 42 డివిజన్లలో కొనసాగుతున్న పారిశుధ్య కార్యక్రమాలు, డ్రైన్ల డీసిల్టింగ్ పనులు, భూగర్భ మురుగునీటి (యూజీడీ) లైన్ల శుభ్రపరిచే కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న డ్రైన్లలో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించే పనులను, అలాగే గల్పర్ మిషన్ల సహాయంతో యూజీడీ లైన్లలో పేరుకుపోయిన మట్టి, చెత్త, వ్యర్థాలను తొలగించే పనులను పరిశీలించారు. వర్షాకాలంలో మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఎక్కడా నీటి నిల్వలు ఏర్పడకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డ్రైన్లు, మ్యాన్‌హోల్స్, యూజీడీ లైన్ల డీసిల్టింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నీరు నిలిచే ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, పారిశుధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలంలో దోమల వ్యాప్తి, సీజనల్ వ్యాధులను నివారించేందుకు పారిశుధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ మున్సిపల్ యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు కూడా నగర పరిశుభ్రత పరిరక్షణలో భాగస్వాములు కావాలని మేయర్ కోరారు. గృహ వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, నిర్మాణ వ్యర్థాలు తదితరాలను డ్రైన్లు, కాలువల్లో వేయకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. డ్రైన్లలో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వర్షాకాలంలో నీటి నిల్వలు, పారిశుధ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎక్కడైనా డ్రైనేజీ సమస్యలు, నీటి నిల్వలు లేదా పారిశుధ్య లోపాలు గమనించిన వెంటనే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ జి. శ్రీనివాస్, నంద్యాల ప్రదీప్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

# బ్రేక్ ఫాస్ట్‌లో బొద్దింక

- **బాసర ఆర్జీయూకేటీ భోజన శాలలో మారని పరిస్థితులు!**




**టి మీడియా ,జూన్ 15, బాసర :**

తినే ఆహారం పరిశుభ్రంగా ఉండాలి. అప్పుడే అనారోగ్యం బారిన పడకుండా ఉంటామని వైద్యులు అందరికీ చెబుతుంటారు. దీనికోసం ప్రభుత్వం కూడా పలు ఆరోగ్య జాగ్రత్తలను పాటిస్తూ పాఠశాలల్లో గానీ కళాశాలల్లో గానీ నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నం చేస్తోంది. కానీ ఏం లాభం. కింది స్థాయిలో ఉండే భోజన నిర్వాహకులు వారి ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో కనీస ప్రమాణాలు పాటించట్లేదు. దీనివల్ల వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లే పరిస్థితి ఏర్పడుతోంది. తాజాగా బాసర ఆర్జీయూకేటీలో ఆదివారం వడ్డించిన అల్పాహారంలో బొద్దింక కనిపించింది. దీంతో విద్యార్థులు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

**ప్రతీసారి పోరాటాలు - మార్పు ఎక్కడ?**

బాసర ఆర్జీయూకేటీలో గతంలో 2022, 2023లో ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో దాదాపు 400 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ విషయంపై సంబంధిత సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారులు నామమాత్రంగానే చర్యలు తీసుకున్నారు. భోజన నిర్వాహకులను మార్చకుండా మళ్లీ పాతవారినే కొనసాగించారు. దీనివల్ల నిర్వాహణ మరోసారి ఇష్టారాజ్యంగా మారింది. ఫలితంగా ఈ ఆదివారం అల్పాహారంలో బొద్దింక వచ్చింది. ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని, ప్రతీసారి పోరాటాలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని విద్యార్థులు వాపోతున్నారు.

**ఇన్‌ఛార్జి ఉపకులపతికి వినతి పత్రాలు**

భోజన శాలల గడువు ముగిసిన తర్వాత సంబంధిత అధికారులు టెండర్లు వేస్తారు. అయితే ఈసారి వేసినప్పుడు పాతవారికి ఇవ్వకూడదని విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పలుమార్లు ఇన్‌ఛార్జి ఉపకులపతికి వినతి పత్రాలు అందించారు. ఈ విషయంలో వారంతా నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. అయినా ఫలితం లేకుండా పోయింది. తిరిగి పాత వారికే టెండర్లు అప్పగించారు.

**సమాధానం చెప్పని నిర్వాహకులు**

ప్రతి ఆదివారం విద్యార్థులకు చపాతీ, ఆలుకుర్మాను టిఫిన్?గా పెడతారు. అయితే ఈ ఆదివారం ఈ1, ఈ2 విద్యార్థులకు వడ్డించిన అల్పాహారంలో బొద్దింక వచ్చింది. ప్రతిరోజు నాణ్యత ప్రమాణాలతో అల్పాహారం, భోజనాన్ని తనిఖీ చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు. మరి ఆదివారం వడ్డించిన అల్పాహారంలో బొద్దింక ఎలా వచ్చిందని విద్యార్థులు ప్రశ్నించారు. కప్ప, బల్లి, బొద్దింకలు వస్తే భోజనం ఎలా చేసేదని భోజనశాల నిర్వాహకుడి దగ్గరకు వెళ్లి నిలదీసినట్లు తెలిసింది. దీనిపై ఎలాంటి సమాధానం చెప్పకుండా నిర్వాహకులు అక్కడి నుంచి వెళ్లిపోయారని విద్యార్థులు అంటున్నారు.

**కమిటీ వేస్తామని కల్లబొల్లి మాటలు**

ఇలాంటి విషయాలు బయటపడిన ప్రతిసారి ఆర్జీయూకేటీలో విద్యార్థులు ఆందోళన చేపడుతూనే ఉన్నారు. అధికారులు కూడా దీనిపై కమిటీ వేసి విచారణ జరుపుతామని ప్రతీసారి అంటూనే ఉన్నారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోకుండా జాప్యం చేస్తున్నారు. గతంలో కూడా ఇలాంటివి జరిగాయి. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం. మరోవైపు ప్రస్తుత ఘటనపై ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ స్పందించారు. అల్పాహారంలో బొద్దింక వచ్చిందన్న విషయం వాస్తవమేనని, దీనిపై కమిటీ వేసి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



## 2 నెలల తర్వాత సముద్రంలో సవ్వడి

- **లంగరెత్తిన మత్స్యకారులు**

**టి మీడియా ,జూన్ 15, అమరావతి బ్యూరో :**

వేట నిషేధంతో నిశ్శబ్దంగా మారిన సముద్రం నేటి నుంచి తిరిగి సవ్వడి చేస్తోంది. రెండు నెలల విరామం తర్వాత మత్స్యకారులు బోటెక్కి వల పట్టారు. అలల సవ్వడులు, బోట్ల ఇంజిన్ల కూత వింటూ సాపాటు కోసం వేటకు వెళ్తున్నారు. దీంతో తీర ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఇక్కడి వరకు అంతా బాగానే ఉన్నా మత్స్యసంపదను వలేసి బంధించే గంగపుత్రులు సమస్యల వలయంలో చిక్కుకుని సతమతమవుతున్నారు. అసలు మత్స్యకారుల ముందున్న సమస్యలేంటి? వారి జీవనం సాఫీగా సాగాలంటే ఏం కావాలి? ప్రభుత్వం నుంచి ఏం కోరుకుంటున్నారు? అనే అంశాలపై ఈటీవీ భారత్? ప్రత్యేక కథనం

**వేటకు సర్వం సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు**

రాష్ట్రవ్యాప్తంగా సముద్ర తీరం కోలాహలంగా మారింది. 2 నెలల వేట నిషేధం తర్వాత గంగపుత్రులు సముద్రంలోకి వేటకు బయలుదేరారు. ఈ తెల్లవారుజాము నుంచే బోట్లు అలలను చీల్చుకుంటూ ముందుకు సాగుతున్నాయి. వేట పునఃప్రారంభం నేపథ్యంలో విశాఖ సహా తీరప్రాంతాలన్నీ నిన్న సాయంత్రం నుంచే వేలాది బోట్లతో కళకళలాడాయి. 15 రోజుల పాటు సముద్రంలోనే ఉండాల్సిన నేపథ్యంలో మత్స్యకారులు అన్ని రకాల ఏర్పాట్లు చేసుకున్నారు. ముందుగా సముద్రుడికి ప్రత్యేక పూజలు చేసి వేట సవ్యంగా సాగాలని మొక్కుకున్నారు. ఆ తర్వాత వల భుజాన వేసి జీవన పోరాటానికి బయలుదేరారు. మరోవైపు మత్స్య సంపద కొనుగోలు చేసేందుకు వ్యాపారులూ సిద్ధమవుతున్నారు. ఐస్ బాక్స్‌లు, ఇతర సామగ్రిని రెడీ చేసుకుంటున్నారు.

**ప్రమాదం జరిగితే ప్రభుత్వ పరిహారం**

రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల మంది మత్స్యకారులు ఉండగా సుమారు 6 లక్షల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా మత్స్య సంపదపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విశాఖ తీరంలోనే దాదాపు 30 వేల మంది ప్రత్యక్షంగా, మరో 25 వేల మంది పరోక్షంగా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నారు. కోనసీమ జిల్లాలో దాదాపు 22 వేల మత్స్యకార కుటంబాలు ఉన్నాయి. వీరిలో 11 వేల మందికి పైగా సముద్రంలో వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు వీరందరినీ ఇప్పుడు కలవరపెడుతున్నాయి. డీజిల్ ఇటీవల కాలంలో దాదాపు ఏడు రూపాయల మేర పెరిగింది. ప్రభుత్వం 9 రూపాయ సబ్సిడీ ఇస్తున్నప్పటికీ ప్రస్తుత మార్కెట్ ధరలతో వేటకు వెళ్లడం పెను భారంగా మారిందని చెబుతున్నారు. మరోవైపు వేటకు వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తు బోట్లు దెబ్బతిన్నా లేదా మునిగిపోయినా పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం

- నిర్ణయం తీసుకున్న బ్రిటన్

**టి మీడియా ,జూన్ 15, ఢిల్లీ బ్యూరో :**

డిజిటల్ యుగంలో పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం గురించి ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో బ్రిటన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 16 ఏళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా యాప్‌లను ఉపయోగించకుండా నిషేధం విధించనున్నట్లు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సోమవారం ప్రకటించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, భద్రత, కుటుంబ జీవనంపై సోషల్ మీడియా వ్యసనం వంటివి దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. లండన్‌లోని ప్రధానమంత్రి అధికార నివాసం 10 డౌనింగ్ స్ట్రీట్ నుంచి దేశాన్ని ఉద్దేశించి ప్రసంగించిన స్టార్మర్, ఇది ప్రధానమంత్రిగా మాత్రమే కాకుండా ఇద్దరు చిన్న పిల్లల తండ్రిగా కూడా తాను తీసుకున్న బాధ్యతాయుతమైన నిర్ణయమని చెప్పారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు వేలాది మంది తల్లిదండ్రులతో ప్రభుత్వం విస్తృతంగా సంప్రదింపులు జరిపిందని కీర్ స్టార్మర్ తెలిపారు. పిల్లలపై సోషల్ మీడియా ప్రభావంపై ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు, నిపుణులు, బాలల హక్కుల కార్యకర్తల అభిప్రాయాలను సేకరించినట్లు తెలిపారు. ముఖ్యంగా టిక్?టాక్, స్నాప్?చాట్, ఇన్?స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికల వల్ల పిల్లలు ప్రతికూల కంటెంట్‌కు గురవుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు



**చదువు, ఆటలకు దూరమవుతున్న పిల్లలు**

సోషల్ మీడియా పిల్లల ఆనందాన్ని దెబ్బతీస్తోందని స్టార్మర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ వేధింపులు, బెదిరింపులు, దుర్వినియోగం పెరగడానికి సోషల్ మీడియా వేదికలు కారణమవుతున్నాయని అన్నారు. అలాగే పిల్లల మానసిక ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదకర కంటెంట్‌ను ఈ ప్లాట్‌ఫారమ్‌లు అందుబాటులోకి తెస్తున్నాయని పేర్కొన్నారు. వినియోగదారులను ఎక్కువసేపు యాప్‌లలోనే ఉంచేందుకు రూపొందించిన అంతులేని స్క్రోలింగ్ వంటి ఫీచర్లు పిల్లలను వ్యసనానికి గురిచేస్తున్నాయని విమర్శించారు. సోషల్ మీడియా వినియోగం వల్ల పిల్లలు చదువుపై దృష్టి కోల్పోతున్నారని పేర్కొన్నారు. పుస్తకాలు చదవడం, బయట స్నేహితులతో ఆడుకోవడం, సమయానికి నిద్రపోవడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు తగ్గిపోతున్నాయని చెప్పారు. సాంకేతికత పిల్లల జీవితంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది వారి అభివృద్ధికి ఆటంకం కలిగించే స్థాయికి చేరకూడదని వ్యాఖ్యానించారు.

**వచ్చే ఏడాది నుంచి అమలు**

ఈ నిషేధాన్ని అమలు చేయడానికి అవసరమైన చట్టపరమైన అధికారాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని బ్రిటన్ ప్రధాని వెల్లడించారు. వచ్చే ఏడాది వసంతకాలం నాటికి ఈ చట్టం అమల్లోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. సాంకేతిక సంస్థలు సోషల్ మీడియాను మార్చడం అసాధ్యమన్న భావన కల్పిస్తున్నప్పటికీ, ప్రభుత్వానికి అవసరమైన మార్పులు తీసుకురాగల శక్తి ఉందని స్టార్మర్ స్పష్టం చేశారు. చట్టం అమలు చేయడం, నియంత్రించడం, పర్యవేక్షించడం సవాలుగా ఉన్నప్పటికీ, పిల్లల భవిష్యత్తు కోసం ఆ సవాళ్లను ఎదుర్కొంటామని చెప్పారు.

**వాట్సాప్‌కు మినహాయింపు**

ప్రతిపాదిత నిషేధంలో అన్ని డిజిటల్ సేవలు ఉండవు. కుటుంబ సభ్యులు, స్నేహితులతో కమ్యూనికేషన్ కోసం ఉపయోగించే వాట్సాప్? వంటి మెసేజింగ్ యాప్‌లకు మినహాయింపు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అయితే గేమింగ్ సేవలు, లైవ్ స్ట్రీమింగ్ వేదికలు, అపరిచిత వ్యక్తులు పిల్లలతో నేరుగా సంప్రదించగలిగే ప్లాట్‌ఫారమ్‌లపై కఠిన పరిమితులు విధించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక వయో నిర్ధారణ వ్యవస్థను రూపొందించే పనులు జరుగుతున్నాయి. సోషల్ మీడియా వినియోగంపై వయోపరిమితులు విధించే దిశగా చర్యలు తీసుకుంటున్న దేశాల జాబితాలో ఇప్పుడు బ్రిటన్ కూడా చేరింది. ఇటీవల జపాన్?లో ప్రభుత్వ కమిటీ సోషల్ మీడియా సంస్థల బాధ్యతలను మరింత కఠినతరం చేయాలని సూచించింది. ఇక ఫ్రాన్స్?లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధాన్ని చట్టబద్ధం చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇక గతేడాదిలో ఆస్ట్రేలియా 16 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా వినియోగంపై సమగ్ర నిషేధాన్ని అమలు చేసింది. అలాగే స్పెయిన్, డెన్మార్క్ వంటి దేశాలు కూడా ఇదే తరహా నిర్ణయాలను పరిశీలిస్తున్నాయి.





## అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై దర్యాప్తు

- కేంద్రమంత్రి రామ్మోహన్

**టి మీడియా ,జూన్ 15, అహ్మదాబాద్ :**

అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన దర్యాప్తు తుది దశలో ఉందని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. అంతర్జాతీయ దర్యాప్తు విధానాలను (ప్రోటోకాల్‌లను) కచ్చితంగా పాటిస్తూ ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) త్వరలోనే తన తుది నివేదికను సమర్పించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై ఏఏఐబీ తుది నివేదిక కోసం తామంతా ఎదురుచూస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణలో మోగిన బడి గంట

(మొదటిపేజీ తరువాయి...)

రాగి జావను ఇవ్వనున్నారు. విడతల వారీగా రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది.

**పిల్లలకు అందించే టిఫిన్? మెనూ ఇదే**

**సోమవారం :** దోసె (2) – సాంబారు, చట్నీ,మంగళవారం : మిల్లెట్ ఇడ్లీ (2) ం సాంబారు,బుధవారం : పూరీ (2) – మిక్స్‌డ్ వెజిటబుల్ కుర్మా,గురువారం : బోండా (2) ం సాంబారు, చట్నీ,శుక్రవారం : ఇడ్లీ (2 )ం సాంబారు, చట్నీ,శనివారం : ఉప్మా ం సాంబారు, చట్నీ (ప్రీ ప్రైమరీ నుంచి 5వ తరగతి విద్యార్థులకు 150 గ్రాముల చొప్పున, 6 నుంచి 12 తరగతుల వారికి 250 గ్రాముల చొప్పున ఉప్మాను అందిస్తారు.

**అమావాస్య ఎఫెక్ట్?**

తద్వారా మొత్తం 29 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచటంతో పాటు పిల్లల్లో పోషకాహార లోపాలను తగ్గించేందుకు ఈ పథకం ప్రారంభించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒక్క హైదరాబాద్?లోనే 45 పాఠశాలల్లో ఈ పథకం కింద బ్రేక్ ఫాస్ట్?ను అందిస్తుంది. ఇక తొలి రోజు అమావాస్య కావటంతో పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లిదండ్రులు పెద్దగా ఆసక్తి చూపలేదు. మరికొన్ని చోట్ల ఉదయం పది గంటల తర్వాత విద్యార్థులు పాఠశాలలకు చేరుకోవటం గమనార్హం.

**అందరం కలిసి ప్రయత్నించాలి**

ప్రభుత్వ పాఠశాలలపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా అందరం ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను పెంచుతున్నామని, త్వరలోనే అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన, సబ్జెక్ట్ నిపుణులు ఉన్నారన్న ఆయన విద్యార్థుల సంఖ్య పెరిగేలా టీచర్లు, ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని పేర్కొన్నారు.

**విద్యార్థులకు ఘన స్వాగతం**

యూసుఫ్‌గూడలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఘన స్వాగతం లభించింది. పాఠశాల యాజమాన్యం మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో ఆవరణను అందంగా అలంకరించి విద్యార్థులను ఆత్మీయంగా ఆహ్వానించింది. ఉపాధ్యాయులు విద్యార్థులు, విద్యార్థినులకు స్వాగతం పలకగా, పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో విద్యార్థులు జాతీయ గీతంతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆనందోత్సాహాల మధ్య కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఎంతో ఉత్సాహంగా పాఠశాలకు వచ్చిన విద్యార్థులు తమ స్నేహితులను తిరిగి కలుసుకోవడం సంతోషంగా ఉందని చెబుతున్నారు.

**మంచి మార్కులు సాధిస్తాం**

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, గత ఏడాదికంటే ఈసారి మరింత కష్టపడి చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తామని విద్యార్థులు పేర్కొన్నారు. ప్రవేశాల కోసం కూడా విద్యార్థులు పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలను ఆశ్రయిస్తున్నారు. నూతన ఆశయాలు, లక్ష్యాలతో విద్యార్థులు కొత్త విద్యా సంవత్సరానికి శ్రీకారం చుట్టగా, యూసుఫ్‌గూడ జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బడి గంట మోగి విద్యా ప్రస్థానం మళ్లీ ప్రారంభమైంది.

**కేసులు నమోదు చేస్తున్న రవాణాశాఖ**

మరోవైపు స్కూళ్లు పునః ప్రారంభమైన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థల వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలపై రవాణా శాఖ కేసులు నమోదు చేస్తుంది. ఇవాళ వెయ్యికి పైగా స్కూల్ బస్సులను తనిఖీలు చేసిన ఆర్టీఏ అధికారులు నిబంధనలు ఉల్లంఘించిన 150కి పైగా బస్సులపై కేసు నమోదు చేశారు. ఫిట్‌నెస్ లేని 35 విద్యాసంస్థల వాహనాలను సీజ్ చేశారు.

## వైజాగ్ ఎయిర్‌పోర్ట్ తరలింపు

(మొదటిపేజీ తరువాయి...)

వాణిజ్య విమాన సేవలు మొదలయ్యాయి. దీంతో ఇది పూర్తి స్థాయి పౌర విమానాశ్రయంగా తన కార్యకలాపాలను ప్రారంభించింది. ఎనిమిది దశాబ్దాల పాటు విశాఖపట్నం ప్రజలకు ఎన్నో మధుర జ్ఞాపకాలను అందించిన ఈ విమానాశ్రయం, తన ప్రయాణాన్ని ముగించి నౌకాదళం చేతుల్లోకి వెళ్లనుంది.

**నౌకాదళం నియంత్రణలో**

వ్యూహాత్మక భద్రతా కారణాల దృష్ట్యా 1986లో ఈ విమానాశ్రయం భారత నౌకాదళం నియంత్రణలోకి వచ్చింది. 1991లో దీనికి ‘ ఐఎన్ఎస్’ డేగా అని పేరు పెట్టారు. అప్పటి నుంచి పౌర విమాన సేవలను కొనసాగిస్తూనే ఇది నౌకాదళం పర్యవేక్షణలో పనిచేస్తోంది. పాత రన్‌వే పొడవు కేవలం 6,000 అడుగులు మాత్రమే ఉండటంతో, పెద్ద విమానాలు దిగడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యను పరిష్కరించడానికి, 10,007 అడుగుల పొడవైన రన్‌వేను నిర్మించి, జూన్ 15, 2007న ప్రారంభించారు.ఇది బోయింగ్ 737 ఎయిర్‌బస్ ఎ 320 వంటి పెద్ద వాణిజ్య విమానాల రాకపోకలకు మార్గం సుగమం చేసింది. రూ.95 కోట్ల వ్యయంతో నిర్మించిన సరికొత్త సమీకృత ప్రయాణికుల టెర్మినల్ భవనం ఫిబ్రవరి 20, 2009న ప్రారంభించారు. రాత్రి వేళల్లో విమానాలు దిగడానికి వీలు కల్పించే సాంకేతికత అయిన ‘ఇన్‌స్ట్రుమెంట్ ల్యాండింగ్ సిస్టమ్ ‘ (2012లో అందుబాటులోకి వచ్చింది. అదే సంవత్సరంలో, ఎయిర్ ఇండియా సింగపూర్‌కు తన తొలి అంతర్జాతీయ విమాన సేవను ప్రారంభించడంతో విశాఖపట్నం ప్రపంచ విమానయాన చిత్రపటంలో స్థానం సంపాదించుకుంది.

# భయం పోయింది, భరోసా వచ్చింది

- కానీ అధికారుల తీరు మారాలి!

**టి మీడియా ,జూన్ 15, అమరావతి బ్యూరో :**



ఒకప్పుడు తమ భూమి ఎక్కడ చేజారిపోతుందోనన్న భయం. రాత్రికి రాత్రే కబ్జాకు గురవుతుందన్న ఆందోళన. గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులు వణికిపోయారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ భయం పోయింది. ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేసి రైతుల్లో కొండంత భరోసా నింపింది. రాజముద్రతో పాసుపుస్తకాలు అందిస్తూ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. అయినా సమస్య పూర్తిగా తీరలేదు. ప్రభుత్వం ఎన్ని ఆదేశాలు ఇస్తున్నా, కింది స్థాయి రెవెన్యూ అధికారులు మాత్రం మారడం లేదు. ఇప్పటికీ ప్రభుత్వానికి వస్తున్న అర్జీల్లో 70 శాతానికి పైగా రెవెన్యూ సమస్యలే ఉంటున్నాయి. ఉన్నతాధికారుల ఉత్తర్వులు కింది స్థాయిలో ‘ఉత్త’ కాగితాలుగానే మిగిలిపోతున్నాయి. ప్రభుత్వం కొరడా ఝుళిపిస్తే తప్ప ఈ సమస్యలు కొలిక్కి వచ్చేలా లేవు. రెవెన్యూ శాఖ ప్రక్షాళన, గత ప్రభుత్వ తప్పిదాలు, ప్రస్తుత సవాళ్ల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

**గత ప్రభుత్వ అరాచకాలు**

వైఎస్సార్సీపీ పాలనలో రైతుల భూములను మింగేసేందుకు ‘ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్’ తెచ్చారు. రాత్రికి రాత్రే పొలం పేర్లు మార్చినా రైతుకు తెలిసే అవకాశం లేకుండా చేశారు. స్థానిక కోర్టులకు వెళ్లే అవకాశాన్ని కూడా ఆ చట్టం ద్వారా లాగేశారు. ఫ్రీహోల్డ్ ముసుగులో వైఎస్సార్సీపీ నేతలు ప్రభుత్వ భూములను కొట్టేశారు. తాత ముత్తాతల ఆస్తుల పాసు పుస్తకాలపై, హద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేసుకున్నారు. మన భూమి మనదే అని రుజువు చేసుకోవడానికి ఎలాంటి ఆధారం లేని దుస్థితి తెచ్చారు. రీసర్వే పేరుతో రైతుల వాస్తవ భూమి విస్తీర్ణాన్ని ఇష్టానుసారంగా తగ్గించేశారు.

**కూటమి సర్కార్ దిద్దుబాటు చర్యలు**

అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశారు. భూ కబ్జా నిరోధక చట్టాన్ని కొత్తగా తీసుకొచ్చారు. జగన్ బొమ్మలను తొలగించి, 15 రకాల భద్రతా ప్రమాణాలు, రాజముద్రతో పాసు పుస్తకాలు ఇస్తున్నారు. రైతులు తమ భూమిని ‘డిజిటల్ లాక్’ (1బి, అడంగల్) చేసుకునే విధానాన్ని తెచ్చారు. వ్యవసాయ భూములను సులభంగా మార్చుకునేలా నాలా చట్టాన్ని రద్దు చేశారు. 22ఏ నిషేధిత జాబితా నుంచి ప్రైవేటు, సైనికోద్యోగుల భూములకు విముక్తి కల్పించారు. 1.34 లక్షల ఎకరాల గ్రామ సర్వీసు ఇనాం భూముల సమస్యను పరిష్కరించారు. తప్పుడు రిజిస్ట్రేషన్ల రద్దు అధికారాన్ని నేరుగా కలెక్టర్లకు అప్పగించారు.

**క్షేత్రస్థాయిలో మారని తీరు**

ప్రభుత్వం పైస్థాయిలో ఎన్ని మార్పులు చేసినా, కింది స్థాయి అధికారుల పనితీరు మారలేదు. రెవెన్యూ శాఖలో ప్రభుత్వం చేసింది 20 శాతమే. చేయాల్సింది ఇంకా 80 శాతం ఉంది. ఫ్రీహోల్డ్ భూముల్లో 7.85 లక్షల ఎకరాలు సక్రమంగా ఉన్నాయని తేల్చారు. అయినా వాటిపై ఇంకా నిషేధం తొలగించలేదు. 20 నెలలుగా ‘ఇదిగో, అదిగో’ అంటూ రైతులను అధికారులు ముప్పుతిప్పలు పెడుతున్నారు. రీసర్వే తప్పిదాలను సవరించుకునేందుకు లక్షల మంది కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తప్పులు సరిదిద్దాకే పాసు పుస్తకాలు ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. కానీ అధికారులు తప్పులతో కూడినవి ఇచ్చి, మళ్లీ సవరణకు దరఖాస్తు చేయమంటున్నారు. ‘ఇతరులు’ ఖాతాల సమస్య, చుక్కల భూముల సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. సమస్యల పరిష్కారానికి అదనపు పత్రాలు అడుగుతూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు.

**ప్రభుత్వం ఏం చేయాలి?**

కార్యదర్శి ఇచ్చే ఆదేశాలకు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ మారడానికి నెలలు పడుతోంది. దాన్ని మండల స్థాయిలో అమలు చేయడానికి మరికొన్ని నెలలు తీసుకుంటున్నారు. ఏ మండలంలో ఎక్కువ సమస్యలు పెండింగ్ ఉన్నాయో ప్రభుత్వం వెంటనే గుర్తించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తేనే రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుంది.

# డప్పు చప్పుళ్లు - పూలతో స్వాగతాలు

**పండగ వాతావరణంలో విద్యార్థులకు వెల్‌కమ్**

**టి మీడియా ,జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**



వేసవి సెలవులు ముగియడంతో రాష్ట్రవ్యాప్తంగా బడి గంట మోగింది. తొలిరోజు విద్యార్థుల రాకతో ప్రభుత్వ, ప్రైవేటు బడులు కళకళలాడాయి. పలు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను బడికి ఆహ్వానించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రంగురంగుల తోరణాలు, బెలూన్లతో గదులను అలంకరించి, చిన్నారుల కోసం ఆటబొమ్మలను సిద్ధం చేశారు. ఉపాధ్యాయుల ఆత్మీయ స్వాగతంతో విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాల్లో పండుగ వాతావరణం నెలకొంది.

**విద్యార్థులకు ఘన స్వాగతం**

హైదరాబాద్? యూసుఫ్‌గూడలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఘన స్వాగతం లభించింది. పాఠశాల యాజమాన్యం మామిడి తోరణాలు, రంగురంగుల పూలతో ఆవరణను అందంగా అలంకరించి విద్యార్థులను ఆత్మీయంగా ఆహ్వానించింది. ఉపాధ్యాయులు విద్యార్థినీ, విద్యార్థులకు స్వాగతం పలకగా, పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని తలపించింది. ముందుగా విద్యార్థులు తొలుత జాతీయ గీతంతో పాటు తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఆనందోత్సాహాల మధ్య కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది.

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య**

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్త విద్యా సంవత్సరానికి స్వాగతం పలుకుతూ స్కూల్ ప్రాంగణాన్ని అందంగా అలంకరించి విద్యార్థులకు ఆహ్వానం పలికారు. ఏప్రిల్ 24 నుంచి జున్ 14 వరకు అనగా 52 రోజుల వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు వచ్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు ఆత్మీయంగా స్వాగతించారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంపొందించడంతో పాటు నూతన విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తామని ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్న నాణ్యమైన విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు.

**డప్పు చప్పుళ్లతో వెల్?కమ్?**

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణాన్ని అందంగా అలంకరించి, విద్యార్థులకు పుష్పగుచ్చాలు ఇచ్చి డప్పుచప్పులతో స్వాగతం పలికారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, ప్రభుత్వ పాఠశాలలో చదువుతో పాటు యూనిఫామ్, బుక్స్, ఉచిత భోజన వసతిని ప్రభుత్వం విద్యార్థులకు సమకూరుస్తుందని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

**పాఠశాల బస్సులు తనిఖీ చేసిన అధికారులు**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వేసవి సెలవులు అనంతరం విద్యాసంస్థలు తిరిగి తెరుచుకున్నాయి. నూతన ఉత్సాహంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ బడుల్లో ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు ప్రైవేటు పాఠశాలల బస్సులను తనిఖీ చేస్తున్నారు.

**విద్యార్థులతో కలకల లాడిన పాఠశాలలు**

వేసవి సెలవుల అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. తొలిరోజు కావడంతో విద్యార్థులకు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. కొత్తగా ప్రవేశం పొందిన వారికి చాక్లెట్లు పంచిపెట్టారు. ఆయా పాఠశాలలను మామిడి తోరణాలు, దేశభక్తుల బొమ్మలతో సుందరంగా తీర్చిదిద్దారు. సరస్వతి చిత్రపటం వద్ద ప్రార్థనలు చేశారు. ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని పాఠశాలల్లో తొలి రోజున పండగ వాతావరణం సంతరించుకుంది. దాదాపు నెల రోజుల పాటు వెలవెలబోయిన పాఠశాల ప్రాంగణాలు, నేడు తిరిగి విద్యార్థులతో కళకళలాడాయి.



## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు

**టి మీడియా ,జూన్ 15, ముదిగొండ**

ముదిగొండ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను మండల అధ్యక్షులు గుడిపూడి బుచ్చిరామయ్య ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో కేక్ కట్ చేసి భట్టి విక్రమార్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని భట్టి విక్రమార్క ప్రజాసేవలు, అభివృద్ధి పట్ల ఆయన నిబద్ధతను కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు మధిర నియోజకవర్గ అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. భట్టి విక్రమార్కకు దీర్ఘాయుష్షు, మంచి ఆరోగ్యం కలగాలని ఆకాంక్షించారు.

## 18 నుంచి 24 వరకు విస్తారంగా వర్షాలు

- ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో కురిసే అవకాశం

**టీ మీడియా, జూన్ 15, హైదరాబాద్ బ్యూరో :**



తెలంగాణ వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి 24 వరకు విస్తారంగా వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ద్రోణి, అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని స్పష్టం చేసింది. నైరుతి రుతుపవనాలు మందకొడిగా ముందుకు సాగడం వల్ల రాష్ట్రమంతా విస్తరించేందుకు ఇంకా నాలుగైదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని వెల్లడించింది. ఉత్తర భారతదేశం నుంచి ఉత్తర తెలంగాణలోకి ఇంకా వేడిగాలుల రాక కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో ఉత్తర తెలంగాణలో ఎండల తీవ్రతతో పాటు వేడిగాలులు వీస్తున్నట్లు చెప్పింది. ఇవాళ, రేపు ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాల్లో వడగాల్పుల వీస్తాయని స్పష్టం చేసింది. క్యూములోనింబస్ మేఘాల వల్ల దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయని వెల్లడించింది. ఆ తరువాత ఈనెల 18 నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు.

**10 శాతం లోటు లోనే వర్షపాతం**

నైరుతి రుతుపవనాలు ఈ నెల 8న దక్షిణ తెలంగాణలోకి ప్రవేశించి జోగులాంబ గద్వాల జిల్లాను ఆవరించగా, ప్రస్తుతం హైదరాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మీదుగా ఉత్తర సరిహద్దు కొనసాగుతున్నాయి. జూన్ 14 నాటికి దక్షిణ తెలంగాణలోని అన్ని జిల్లాల్లోనూ వ్యాపించగా మధ్య తెలంగాణలోని వివిధ జిల్లాలను రుతుపవనాలు తాకాయి. రాష్ట్రంలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 49.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, సాధారణ వర్షపాతం 54.9 మిల్లీమీటర్లతో పోలిస్తే సుమారు 10 శాతం లోటు ఉంది.